క్లుప్తంగా

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

ఆత్మకూరు: పట్టణంలోని శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం శోభకృత్ నామ తెలుగు సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ పట్టణ అధ్యక్షులు గరుడాద్రి సుందర్శనశర్మ మాట్లాడుతూ తెలుగు సంవత్సరం సంప్రదాయాలకు ప్రతీక అన్నారు. ఈ ఏడాది దేశ ప్రజలందరికీ సుఖ శాంతులు కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్‌గుప్త, ఆవులరెడ్డి, శంకర్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు

- కేజీ రోడ్డు వెంట దుకాణాలన్నీ బంద్



దుకాణాలు బంద్ చేసి ఉన్న దృశ్యం

పాములపాడు: ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా రోడ్ల వెంట ఇరువైపులా ఉండేదుకాణాలు బంద్ చేయించినట్లు ఆత్మకూరు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. శ్రీశైలం ఉగాది ఉత్సవాల నేపథ్యంలో బుధవారం దోర్నాల నుంచి ఆత్మకూరు సర్కిల్ పరిధి వరకు దుకాణాలు బంద్ చేయించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలో కూడా దుకాణాలు బంద్ చేయించారు. సీఐ మాట్లాడుతూ.. శ్రీశైలంలో భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకున్న కన్నడిగులు తిరుగు ప్రయాణమై వెళ్తున్నారన్నారు. వారు ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలిపి వేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తే అవకాశం ఉందన్నారు. దుకాణాల వద్ద కూడా వాహనాలు నిలిపి దుకాణాల వద్ద గుమికూడటం జరుగుతుందని చెప్పారు. అంతే కాకుండా కర్ణాటకకు ప్రత్యేక బస్సులు కూడా ఉన్నందున ట్రాఫిక్ అధికంగా ఉంటడంతో సమస్య జఠిలమతుందని ఉన్నతాధికారులు దుకాణాలు బంద్ చేయించాలని ఆదేశాలు జారీ చేశారన్నారు.

కన్నడిగులకు అన్నదానం



శివోహంట్రస్ట్ ఆధ్వర్యంలో కన్నడిగులకు అన్న ప్రసాద వితరణ దృశ్యం

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని సద్గురు సనారివిశ్వేశ్వర అన్నపూర్ణదేవి ఆశ్రమం, మౌనస్వామి ఆశ్రమం, దత్తగిరి, మాణిక్యేశ్వరి మాత ఆశ్రమాల్లో కన్నడిగులకు గత 5 రోజులుగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అన్నపూర్ణాదేవి ఆశ్రమంలో టెంపుల్ శివోహం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆశ్రమ నిర్వాహకులు అరవింద్ రెడ్డి, కార్యనిర్వాహక సభ్యులంతా కలిసి వచ్చిన వారికి లేదనకుండా ఉదయం నుంచి రాత్రి 11 గంటల వరకు భోజనసౌకర్యంతో పాటు వారు విశ్రమించేందుకు అనుకూలంగా ఏర్పాటు చేశారు. తిరుపతి నాయన రమణమ్మల ఆశీస్సులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

స్థల దానం ప్రశంసనీయం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న సర్పంచ్ శేషన్న

పగిడ్యాల: స్థానిక చెన్నకేశవ స్వామి రథాన్ని ఆలయం వద్ద నిలిపేందుకు రూ.2 లక్షల విలువ చేసే స్థలాన్ని దానం చేయడం ప్రశంసనీయని గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రమాదేవి అన్నారు. బుధవారం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన స్థల దాన శిలాఫలాకాన్ని సర్పంచ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. దాతలు రాయపు వెంకటరామిరెడ్డి, శివానంద భారత స్వామిజీ అలియాస్ రాయపు జయప్రతాపరెడ్డి వారి పూర్వీకుల జ్ఞాపకార్థం రథాన్ని ఉంచడానికి ఊరవాకిలి వద్ద సుమారు ఒక సెంటు స్థలాన్ని విరాళంగా అందించి దాతృత్వాన్ని చాటుకున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లె సత్యనారాయణరెడ్డి, పెద్దిరెడ్డిగారి భాస్కరరెడ్డి, గ్రామ పెద్దలు బాబురెడ్డి, బొగ్గుల శివారెడ్డి, పుల్యాల వాసురెడ్డి పాల్గొన్నారు.

డ్రైనేజీలో పడి వ్యక్తికి గాయాలు

పగిడ్యాల: మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలో బుధవారం నిర్వహించిన బండలాగుడు పోటీలను తిలకించడానికి వెళ్లి అదుపు తప్పి ఓ వ్యక్తి డ్రైనేజీ కాలువలో పడగా కుడి చేయి విరిగి గాయాలయ్యాయి. బాధితుడు పగిడ్యాల గ్రామానికి చెందిన సంగెం చిట్టెన్న కుమారుడు దావీదుగా పోలీసులు గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందించారు. అతిగా మద్యం సేవించడం వల్ల ప్రమాదానికి గురయ్యాడని పోలీసులు వెల్లడించారు. దావీదును కుటుంబీకులు చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు.

మల్లన్న రథోత్సవం..

పులకించిన భక్తజనం



రథోత్సవంలో పాల్గొన్న భక్తజనసందోహం



రథాంగబలిని సమర్పిస్తున్న ఈఓ, పీఠాధిపతి, అర్చకులు, అధికారులు

జ్యోతిర్లింగక్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో వైభవోపేతంగా ఉగాది మహోత్సవాలు జరుగుతున్నాయి. బుధవారం మల్లన్న రథోత్సవం కనుల పండువగా సాగింది. ఉత్సవాన్ని తిలకించేందుకు కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి భక్తులు అశేషంగా తరలివచ్చారు. భక్తుల జయజయ ధ్వానాల మధ్య రథం ముందుకు సాగింది. తెలుగు సంవత్సరాది ఉగాదిని పురస్కరించుకొని దేవస్థానం ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. – శ్రీశైలంటెంపుల్



పూలతో అలంకరించిన శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల రథం



పంచాంగ శ్రవణంలో పాల్గొన్న అర్చకులు, వేదపండితులు, స్థానాచార్యులు

శ్రీశైలంలో పండిత సత్కారం

శ్రీశైలంటెంపుల్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో సంప్రదాయబద్ధంగా పండిత సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉభయ దేవాలయాల అర్చకులకు, స్థానాచార్యులకు, వేదపండితులకు శాలువా, నూతన పంచాంగం, కొబ్బరిబోండం తదితర వాటిని అందజేసి సత్కరించారు. అలాగే పండిత సత్కార కార్యక్రమంలో దేవస్థాన అస్థాన సిద్ధాంతి పండిత బుట్టే వీరభద్ర దైవజ్ఞను సన్మానించారు.

ఉగాది పురస్కారం

రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం శ్రీశైలంలో వైదిక సిబ్బందికి ఉగాది పురస్కారాలు అందజేశారు. ఇద్దరు అర్చకస్వాములకు, ఒక వేదపండితుడికి ప్రత్యేక సత్కారం చేశారు. అమ్మవారి ప్రధానార్చకులు ఉమానాగేశ్వరశాస్త్రి, స్వామివారి ఆలయ ప్రధానార్చకులు కె.శివప్రసాద్, వేదపండితులు కె.పృథ్వీకుమార్ శర్మలకు పురస్కారాలు అందజేశారు. ఈ పురస్కారంలో నూతనవస్త్రాలు, స్వామిఅమ్మవార్ల ప్రసాదాలు, సంభావన అందజేశారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

కొత్తపల్లి: రైతుల సమస్యలు పరిష్కరించకపోతే ప్రధాని మోదీ మెడలు వంచుతామని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ రాజశేఖర్, జిల్లా నాయకులు రామేశ్వరరావు నాగేంద్రుడు డిమాండ్ అన్నారు. ప్రజా సంపాదనంతా పెట్టుబడిదారులు కార్పొరేట్ చేతుల్లో ఉండడంతో పాటు దేశ ప్రజలపై మరింత పన్నుల భారం మోపుతున్న మోదీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. బుధవారం మండలంలోని పాత మాదుగుల, ఎర్రమఠం, ముసలమడుగు, సింగరాజుపల్లి గ్రామాల్లో రైతులను కలిసి ఏప్రిల్ 5న చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులు వేస్తున్న అన్ని పంటలకు మద్దతు ధర ఉండే విధంగా పార్లమెంటులో చట్టం చేయాలన్నారు.

ఊరూరా ఉగాది సంబరాలు

- గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు
- ఆలయాల్లో పంచాగ శ్రవణం
- శోభకృత్ నామ సంవత్సరంలో అన్ని శుభాలే కలుగుతాయంటున్న పండితులు



పాములపాడులో అలంకరించిన ఎద్దుల కాడి కట్టి సేద్యం చేస్తున్న రైతన్న



భక్తులతో కిటకిటలాడుతున్న నందికొట్కూరు సుంకులమ్మ దేవాలయం



వెలుగోడులో పంచాంగ పఠనం చేస్తున్న పురోహితుడు యజ్ఞ నారాయణ శర్మ



కొత్తపల్లి తాండవమల్లేశ్వర స్వామి ఆలయంలో పంచాంగ శ్రవణంలో గ్రామస్తులు, భక్తులు

నందికొట్కూరు: తెలుగు సంవత్సరాది తొలి పండుగైన ఉగాదిని పురస్కరించుకొని బుధవారం భక్తులు పట్టణంలోని సుంకులమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం భక్తులతో కిటకిట లాడింది. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

పట్టణంలోని సాయిబాబా దేవాలయంలో పురోహితులు సురేష్ పంచాంగ పఠనం చేశారు. ప్రజలు శ్రద్ధగా విని, వారి పేరు పై ఈ ఏడాది బలం (ఆర్థిక స్థితి) ఆదాయం, వ్యయం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు.

పాములపాడు: శోభకృత్ నామ తెలుగు సంవత్సరాది, ఉగాది పండుగను పురస్కరించుకొని బుధవారం ప్రజలు ఊరూరా సంబరాలు జరుపుకున్నారు. పండుగ సందర్భంగా ఉదయమే తలంటు స్నానాలాచరించి, ఉగాది పచ్చడి చేసి, పిండివంటలతో నైవేద్యాలు వండి గ్రామ దేవతలకు, కాయ కర్పూరాలతో సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. వృక్షాలకు ఊయలలు కట్టి యువతీ, యవకులు ఉత్సాహంగా ఊగారు. ఉగాది రోజు ఉట్టి పట్టుకొని ఐనా ఊగాలన్నది పెద్దలు చెప్పే సామెత. గ్రామాల్లోని ఆలయాల వద్ద పురోహితులు పంచాంగ పఠనం చేశారు. ప్రజలు వారి వద్దకు వెళ్లి ఈ సంవత్సరం తన పేరు బలం ఎలా ఉందని చెప్పించుకున్నారు. రాశి ఫలం ఆధారంగా కుటుంబంలో ఎక్కువ ఆదాయం ఉన్న వారు ఎద్దులను అలంకరించి కాడి గట్టి పొలాలకు వెళ్లారు.

ఆత్మకూరు: శోభకృత్ నామ సంవత్సర వేడుకలు పట్టణంతో పాటూ, మండలంలోని అన్ని గ్రామాలలో బుధవారం ఘనంగా జరిగాయి. తెలుగు సంప్రదాయ రీతిలో ప్రజలు, రైతులు వృషభరాజములను అందంగా అలంకరించి కుటుంబ సమేతంగా గ్రామ దేవతలకు పూజలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీవాసవికన్యకా పరమేశ్వరి, శ్రీసాయిబాబ దేవాలయం, వెంకటేశ్వర దేవాలయం, అంబాభవాని దేవాలయాల వద్ద పండితులు పంచాంగ శ్రవణం చేశారు. వేదపండితులు పంచాంగ పఠనం చేస్తూ ఈ ఏడాది పాడి పంటలో రైతులు సుభిక్షంగా ఉంటారని, వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు, అన్ని రంగాల ప్రజలు ఈ ఏడాది ఉగాది అన్ని శుభాలే కలిగిస్తుందని తెలిపారు.

వెలుగోడు: మండలంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం పాత ఆంజనేయ స్వామి గుడి, చెన్నకేశవ స్వామి ఆలయం, రామలయంలో పూరోహితులు యజ్ఞ నారాయణ శర్మ పంచాగం చదివి వినిపించారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని తమ రాశులను భక్తిశ్రద్ధలతో విన్నారు. భక్తులకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందజేశారు.

కొత్తపల్లి: మండల కేంద్రంలో వెలసిన శ్రీ పార్వతీ సమేత తాండవ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం శుభకృత్‌నామ సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ పురోహితులు యాదవేని లక్ష్మీ నరసయ్య, మల్లికార్జున ఆచారి పంచాంగ పఠనం చేశారు. గ్రామస్తులు భక్తులు భక్తితో పూజలు చేసుకొని ఉగాది పంచాగం చదివించుకున్నారు.

సంప్రదాయ రీతిలో పూజలు

పగిడ్యాల: శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను మండలంలోని పీకే ప్రాగటూరు, నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి, పగిడ్యాల, బీరవోలు, సంకిరేణిపల్లె, పాలమర్రి, లక్ష్మాపురం, ఎం.ఎన్. ఘణపురం, తూర్పు, పడమర ప్రాతకోట తదితర గ్రామాల్లోని ప్రజలు సంప్రదాయ రీతితో నిర్వహించారు. నెహ్రూనగర్ గ్రామ శివారులో కొలువుదీరిన సుంకులా పరమేశ్వరి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. రైతులు పురోహితులను ఆశ్రయించి వ్యవసాయ పంచాంగాన్ని అడిగి ముహూర్తపు సేద్యాలకు బయలుదేరారు.

మిడుతూరు: మండలకేంద్రమైన మిడుతూరుతో పాటు అన్ని గ్రామాల్లో ఉగాది పర్వదిన వేడుకలు సాంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. పిండివంటలు చేసి గ్రామ దేవత సుంకులమ్మ ఆలయంలో అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఇంటిలో ఉగాది పచ్చడి చేసుకొని ఇంటిల్లిపాది ఆరగించారు. యువత రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. సాయంత్రం శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో వేధపండితులు సుబ్రమణ్యం శర్మ పంచాంగం చదివి వినిపించారు.



నెహ్రూనగర్‌లో సుంకులమ్మ ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు



మిడుతూరులో రంగులు చల్లుకుంటున్న యువత

స్వామివారి పాదాలను స్పృషించని సూర్యకిరణాలు

స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రతి ఏటా చైత్రశుద్ధ పాడ్యమి ఉగాది పర్వదినం రోజున స్వా మివారి మూలవిరాట్ పాదాలను సాయంత్రం సమయంలో సూర్యకిరణాలను స్పృశించడం ఆనవాయితీ గా వస్తోంది. ఈ ఏడాది స్వామివారి పాదాలకు సూర్యకిరణాలు స్పృశించకపోవడంతో భక్తులు నిరాశచెందారు.



తాటిపాడు గ్రామంలో దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిస్తున్న లక్ష్మీ చెన్నకేశవస్వామి

జూపాడుబంగ్లా : శోభకృత్‌నామ తెలుగు సంవత్సర ప్రారంభాన్ని పురస్కరించుకొని బుధవారం మండలంలోని తాటిపాడు, జూపాడుబంగ్లా, తంగడంచ, తర్తూరు, పారుమంచాల, తర్తూరు, తూడిచెర్ల, తరిగోపుల, 80బన్నూరు, మండ్లెం తదితర గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో వేడుకలు జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. తాటిపాడు గ్రామంలో శ్రీలక్ష్మిచెన్నకేశవ స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కూర్చొబెట్టి గ్రామంలోని పురవీధుల్లో తిప్పారు. సాయంకాలం వేళలో ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో పురోహితులు పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా శోభకృత్‌నామ తెలుగు సంవత్సరంలో అంతా శుభం జరుగుతుందని, పాడి పంటలకు అనుకూలంగా ఉంటుందని పురోహితుడు సత్యనారాయణశర్మ తెలిపారు.

బండిఆత్మకూరులో రంగు బండ్ల సందడి

బండిఆత్మకూరు : మండలంలోని అన్ని గ్రామాల్లో ఉగాది పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ఒకరిపై ఒకరు రంగునీళ్లు చల్లుకుంటూ వేడుకలు చేసుకున్నారు. బండిఆత్మకూరులో రంగు బండ్లను కట్టి గ్రామంలో మేళతాళాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. రంగుబండ్లతో పాటు గ్రామస్తులు సుంకులమ్మ ఆలయం వద్దకు వెళ్లి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. బండిఆత్మకూరులో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పంచాంగ శ్రవన కార్యక్రమం నిర్వహించారు.



రంగుబండిలో సందడి చేస్తున్న చిన్నారులు

సున్నిపెంటలో నూకాంబాదేవికి పూజలు



శ్రీశైలంప్రాజెక్ట్: ఉగాది పర్వదినాన శ్రీశైలంప్రాజెక్ట్ కాలనీలోని వైజాగ్‌క్యాంప్ ప్రాంతంలోని నూకాంబికా దేవి అమ్మవారి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాదాలను అందజేశారు.

మహానందిలో ఉగాది మహోత్సవ పూజలు

మహానంది: ఉగాది పర్వదినం సందర్భంగా మహానందిలో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. శ్రీ కామేశ్వరీ, మహానందీశ్వరస్వామివార్లకు పీఠార్చన, రుద్రాభిషేకం, ఖడ్గమాలార్చన పూజలు వైభవంగా జరిగాయి. అంతకు ముందు గణపతిపూజ, పుణ్యాహవాచనం, ఉత్సవమూర్తులకు తిరుమంజనం చేసి నింబకుసుమ భక్షణ నివేదించారు. నంద్యాల డీఎస్పీ మహేశ్వరరెడ్డి కుటుంబ సమేతంగా మహానందికి చేరుకుని మహానందీశ్వరస్వామివారిని దర్శించుకుని పూజలు చేపట్టారు.



మహానందిలో పూజలు చేస్తున్న పండితులు

తరలివస్తున్న కన్నడిగులు

శ్రీశైలంలో రథోత్సవం అనంతరం కన్నడ భక్తులు లక్షలాది సంఖ్యలో మహానందికి తరలిరావడం ఆనవాయితీ. అందులో భాగంగా వేలాది సంఖ్యలో భక్తులకు మహానందికి చేరుకుంటున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయంలో భక్తులరద్దీ కొనసాగింది. నంద్యాల డీఎస్పీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సీఐ జి.రవీంద్ర, మహానంది, బండిఆత్మకూరు ఎస్‌ఐలు నాగార్జున రెడ్డి, బాబు బందోబస్తు నిర్వహించారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

పగిడ్యాల: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలో అఖిల భారత స్థాయి నాలుగు పళ్ల సైజ్ బండలాగుడు పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలను నందికొట్కూరు మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని ప్రారంభించారు. పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన 15 జతల వృషభాలు పాల్గొన్నాయి. హోరాహోరీగా నయనానందంగా సాగిన పోటీల్లో పంచలింగాల బైపోగు బుల్స్ మొదిటి స్థానంలో, గుడిపాడు, రుద్రవరం గ్రామాలకు చెందిన వెంకటరామిరెడ్డి, ఎల్లగౌడ్‌ల వృషభాలు ఒకే దూరం లాగి సంయుక్తంగా రెండవ విజేతగా నిలిచాయి. మూడవ బహుమతిని ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు గ్రామానికి చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి ఎద్దులు గెలుపొందాయి. వరుసగా పది స్థానాలలో నిలిచిన వృషభాల యజమానులకు ఉత్సవ కమిటీ సభ్యులు నగదు పారితోషికాలను అందజేశారు.



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని

మహానందిలో డ్రోన్ కెమెరా చక్కర్లు

మహానంది: మహానంది ఆలయంలో మంగళవారం రాత్రి ఓ డ్రోన్ కెమెరా చక్కర్లు కొట్టడం కలకలం రేపింది. ఈ విషయం సోషల్ మీడియాలో రావడంతో చర్చనీయాంశమైంది. దీనిపై స్పెషల్‌బ్రాంచ్, ఇంటెలిజెన్స్ పోలీసులు ఆరా తీశారు. ఆలయ పరిసరాల్లో అనుమతి లేకుండా డ్రోన్ కెమెరాల ద్వారా చిత్రీకరణ చేయడం చట్టవిరుద్ధం. అయితే తాజాగా పలు సందర్భాల్లో మహానంది ఆలయంపై డ్రోన్ కెమెరాలు తిరుగుతుండటం వివాదాలకు తావిస్తోంది. గతంలో పలువురు డ్రోన్‌కెమెరాల ద్వారా ఆలయ దృశ్యాలను చిత్రీకరించే సమయంలో పోలీసులు, దేవస్థానం సిబ్బంది అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. దేవస్థానం అధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంపై ఏఈఓ మధు మాట్లాడుతూ.. దీనిపై విచారణ చేయగా అది డ్రోన్ కెమెరా కాదని, పిల్లలు ఆడుకునే పిల్లులు హెలికాప్టర్‌గా నిర్ధారణ అయ్యిందని వివరించారు.

ఆకట్టుకున్న కవిసమ్మేళనం

నంద్యాల(వ్యవసాయం): తెలుగు ప్రజల మనోతేజస్సు ఉగాది అని సూరన సారస్వత సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సహదేవుడు, రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక శ్రీ వివేకానంద ఆడిటోరియంలో శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కవిసమ్మేళనం ఆహుతులను అలరించింది. కవులు నీలకంఠం ఆచారి, శ్రీనివాసరెడ్డి, ప్రసాద్, రత్నకుమారి, లలితాసరస్వతి, ఇంతియాజ్ అహ్మద్, ఎల్లయ్య, రఫీ, మోహన్‌రావులు వినిపించిన కవిత్వం ఆకట్టుకుంది. అనంతరం కవులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసెలు దగ్ధం

మహానంది: పొద్దున్నే పండగ. కష్టపడి పనిచేసి జీవనం సాగించేవారు వారు వారి స్తోమతకు తగినట్లు కొత్తబట్టలు తెచ్చుకున్నారు. మరి కొద్ది గంటల్లో తెలవారుతుందనగా ఉగాది నూతన సంవత్సరం వారికి విషాదం మిగిల్చింది. బుధవారం తెల్లవారు జామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు గుడిసెలు దగ్ధం కావడంతో అల్లీనగరంలోని రెండు కుటుంబాల్లో విషాదం అలుముకుంది. గ్రామానికి చెందిన పొంతా మధు, సుక్కా విజయ్‌లు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే తెల్లవారుజామున విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పక్కపక్కనే ఉన్న రెండు గుడిసెలు కాలి బూడిదయ్యాయి. నిప్పులు ఇంట్లో పడటంతో శబ్దం వచ్చి నిద్రలో నుంచి బయటకు పరుగులుతీశారు. కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వచ్చినా మంటలను అదుపుకాక గుడిసెలు కాలిపోయాయి. ఈ ఘటనలో రెండు కుటుంబాలకు సుమారు రూ. 2.50లక్షలు నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. పొదుపు చేసుకున్న కూలీ డబ్బులు కూడా కాలిబూడిదయ్యాయని విలపించారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ మద్దుల లక్ష్మీదేవి, ఆమె భర్త, వైఎస్సార్‌సీపీ నేతలు బాలవెంకటరెడ్డి, మద్దిలేటియాదవ్‌లు వారిని పరామర్శించారు.



బాధితులకు సాయం అందిస్తున్న వాల్మీకి సంఘం నేతలు

బాధితులకు చేయూత

వాల్మీకి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయ పులికొండన్న, జిల్లా అధ్యక్షుడు మీనిగ నారాయణ, మండల అధ్యక్షుడు గాజులపల్లె జయరాం, నాగేశ్వరరావులు గ్రామానికి చెందిన బోయ మధు, విజయుడులకు నిత్యావసర వస్తువులు, కొంత నగదు అందించి అండగా నిలిచారు. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డితో ఫోన్లో మాట్లాడి బాధితులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. బాధితులకు అండగా ఉంటానని, పరామర్శించేందుకు వస్తానని ఆయన భరోసానిచ్చారు. మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి సాయంత్రం గ్రామానికి చేరుకుని బాధితులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు.

చెక్‌డ్యామ్‌లో పడి గుల్బర్గా వాసి మృతి

శ్రీశైలం: క్షేత్రపరిధిలోని హెలిప్యాడ్ సమీపంలో ఉన్న చెక్‌డ్యామ్‌లో ప్రమాదవశాత్తు పడి కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లా, జిడిగ గ్రామానికి చెందిన గురప్ప(30) మృతి చెందాడు. బుధవారం మధ్యాహ్నం అతని మృతదేహం నీటిపై తేలుతున్నట్లు గమనించిన భక్తులు సమీపంలోని పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో వన్‌టౌన్ పీఎస్ రైటర్ సుంకన్న, పోలీసులు చెక్ డ్యామ్ వద్దకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించారు. అతని వద్ద దొరికిన ఆధార్‌కార్డు ఆధారంగా వివరాలు సేకరించి వారి బంధువులకు సమాచారం అందించామని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసినట్లు చెప్పారు.